క్లుప్తంగా

ఈరన్న స్వామికి విరాళం



దాతలకు స్వామి వారి ప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయం అభివృద్ధికి ఆదివారం ఓ భక్తుడు రూ.25,000 విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి తెలిపారు. ఆదోని వాస్తవ్యులు బోయ సీతారాం, బోయ శాంతి కుటుంబ సభ్యులు ఆలయ జీర్ణోద్ధరణ, అభివృద్ధి పనులకు విరాళం దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు చెప్పారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు, పూలమాల, స్వామి వారి శేషవస్త్రాలు, లడ్డూలు, బాండును అందజేశారు. భక్తులు విరివిగా విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని ఆమె కోరారు. ఆలయ పర్యవేక్షకుడు మల్లికార్జున, సిబ్బంది ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి అంకురార్పణ



స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ

ఎమ్మిగనూరు: కలియుగ ప్రత్యక్ష దైవం కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. వేద బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో హైందవ సంప్రదాయానికి అనుగుణంగా భారీ స్థాయిలో ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. స్థానిక మార్కెట్ యార్డు వెనుకభాగంలో ఆదివారం తెల్లవారుజామున స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. గత కొంత కాలంగా గర్భగుడి నిర్మాణం జరుగుతోంది. ఆలయ నిర్మాణంలో భాగంగా దాతల సహకారంతో వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా తెప్పించారు. మంచి ముహూర్తం ఉండటంతో తిరుపతి నుంచి తెచ్చిన చిన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు, హోమాలు నిర్వహించారు.

తప్పనున్న కుక్కల బెడద



గుంపులుగుంపులుగా ఉన్న కుక్కలు

మద్దికెర: నిత్యం ఏదో ఒకచోట కుక్కల దాడులతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన అధికారులు స్థానిక పంచాయతీ పరిధిలో కుక్కలు పట్టుకుని తరలించడంతో పాటు వాటి సంతతి నిరోధించే ఆపరేషన్లు చేపట్టనున్నట్లు ఈఓ శ్రీహరి ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నేటి నుంచి వీధి కుక్కలు పట్టుకెళుతున్నట్లు ప్రచారం చేస్తున్నామని, పెంపుడు కుక్కలు ఉంటే ఇళ్లలోనే ఉంచుకోవాలన్నారు. వీధుల్లోకి వదిలితే వాటిని కూడా పట్టుకెళ్తామన్నారు.

తుది దశకు వంతెన నిర్మాణ పనులు



బ్రిడ్జిపై పూర్తయిన కాంక్రీటు పనులు

నందవరం: తెలంగాణ, ఆంధ్రా సరిహద్దులను కలుపుతూ బంధాలకు వారధిగా నాగులదిన్నె వంతెన వర్ధిల్లింది. 2009 వరద ధాటికి నందవరం మండలం నాగులదిన్నె బ్రిడ్జి కూలిపోయిన విషయం విధితమే. బ్రిడ్జి నిర్మాణం ఆలస్యం కావడంతో దశాబ్దానికిపైగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి పట్టుబట్టి వంతెన నిర్మాణానికి కృషి చేశారు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. వంతెనపై కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. తెలంగాణ, ఆంధ్రా ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణాలు చేపడితే పనులు పూర్తవుతాయి. అప్రోచ్ రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేసి రాకపోకలకు వీలు కల్పించాలని సరిహద్దు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వాల్మీకులకు సముచిత స్థానం

పత్తికొండ రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వాల్మీకులకు సముచిత స్థానం కల్పించారని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ఆస్పరి నరేంద్ర ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు గుమ్మనూరు జయరాం కీలకమైన కార్మిక శాఖ మంత్రిగా, సుభాష్‌చంద్రబోస్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎంపిక కావడం సంతోషదాయకమన్నారు. ప్రస్తుతం కర్నూలు నుంచి డాక్టర్ మధుసూదన్‌ను, అనంతపురం నుంచి మాజీ ఎంపీ గంగాధర్ సతీమణి మంగమ్మను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించడం శుభపరిణామమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే వాల్మీకులకు మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

పొలంబడి.. ప్రయోగాల సవ్వడి

- సాంద్ర వ్యవసాయ పద్ధతిలో వరి సాగు
- జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా నదికైరవాడి
- రైతుల్లో విశేష స్పందన



పొలంబడిలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టిన అధికారులు

ఎమ్మిగనూరు: సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేపట్టి భూసార సంరక్షణ, ఆరోగ్యకరమైన దిగుబడులను ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వినూత్న కార్యక్రమమే పొలంబడి. పంట పొలంలో 30 మంది రైతులను సమావేశపరచి మూడు పద్ధతుల ద్వారా పంట సాగులో వస్తున్న మార్పులను పరిశీలించి చర్చిస్తారు. సమగ్ర పంట యాజమాన్యాలను అమలుపరుస్తూ ఆర్థికంగా లాభదాయకమైన నిర్ణయాలతో సేంద్రియ వ్యవసాయం దిశగా రైతులను మళ్లిస్తూ రైతు సాధికారితను సాధించడమే డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి లక్ష్యం.

పైలట్ ప్రాజెక్టు(వరి ధాన్యం)గా నదికైరవాడి

ప్రతి జిల్లాకు ఒక పంటను ఈ ఏడాది పైలట్ ప్రాజెక్టుగా చేపట్టేందుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం కింద జిల్లాలో వరి పంటను ఎంచుకున్నారు. పైలట్ ప్రాజెక్టుగా నందవరం మండలం నదికైరవాడి గ్రామాన్ని ఎంపిక చేశారు. గ్రామానికి చెందిన ఉత్తనూరు సురేష్ (పొలం సదుపాయ కర్త) 2 ఎకరాల పొలంలో 30 మంది రైతులతో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా చేస్తున్న సాంద్ర వ్యవసాయ విధానం పట్ల రైతుల్లో ఆసక్తి, అవగాహన పెంపొందుతున్నాయి.

మూడు పద్ధతుల్లో సాగు

రైతు సమకూర్చిన 2 ఎకరాల పొలంలో అర ఎకరా పొలాన్ని వ్యవసాయాధికారులు తీసుకొని సమగ్ర సస్యరక్షణ ద్వారా పంటసాగు చేపట్టడం మొదటిది. ఇందులో వరినారు వేర్లను నాటేటప్పుడు సూడోమోనాస్ ద్రావణంలో ముంచడం, నారు తొనలు తుంచడం, ఖాళీబాటలు ఏర్పాటు చేయడం, జిగురు అట్టలు పెట్టడం, లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయడం చేశారు. రెండవ పద్ధతిలో రైతు సురేష్ అర ఎకరా పొలంలో గత కొన్నేళ్లుగా సాగు చేస్తున్న పద్ధతిలోనే సాగు చేపట్టడం. మూడవది ప్రయోగాత్మకంలో ఒక ఎకరాలో సాగుచేసిన వరి పంటకు సూటి ఎరువులు, కాంప్లెక్స్ ఎరువుల వాడకంలో తేడాను గుర్తించడం చేస్తారు. అలాగే వరి వేర్లు, మొనలు, ఆకులు కత్తిరించడం ద్వారా పంటకు ఎటువంటి నష్టం ఉండదనే భరోసాను రైతులకు కల్పిస్తారు. పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులను వేసి పంట నష్టం -ఆర్థిక నష్టం పొందకుండా ఉండాలని నేర్పిస్తారు. మట్టి నమూనా పరీక్ష, విత్తనశుద్ధి, విత్తన నాణ్యత పరీక్షించడం, మిత్ర పురుగుల ఆకర్షణ విధానం వంటి సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా వ్యవసాయాధికారులు చేపట్టే సాగు విధాన ఫలితాలను రైతులు పొందేలా కార్యోన్ముఖులను చేసేందుకు పొలంబడిలో పంట కాలం మొత్తం (14 వారాల పాటు) శిక్షణ ఇస్తారు.

రైతుల్లో విశేష స్పందన

పైలట్ ప్రాజెక్టుగా నదికైరవాడి గ్రామంలో వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమానికి విశేష స్పందన వస్తోంది. 30 మంది రైతులు పంట విధానాలను తెలుసుకొంటూ, అనుమానాలను నివృత్తి చేసుకొంటూ పొలంబడిలో పాల్గొంటున్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో 150 ఎకరాల్లో పంట సాగు చేస్తామని అధికారులకు హామీ ఇవ్వడం గమనార్హం.

పొలంబడితో ప్రయోజనాలు

డాక్టర్ వైఎస్సార్ పొలంబడి వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు, శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. సేంద్రియ విధానాన్ని వ్యవసాయంలో భాగంగా మార్చడం, సమగ్ర సస్యరక్షణలో భాగంగా రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించడం, తద్వారా సాగు ఖర్చును రైతులకు తగ్గించే అవకాశం ఉంది. పంట దిగుబడులను స్థిరీకరించడం, ఆరోగ్యవంతమైన ఉత్పత్తులను మానవాళికి అందించడం, పర్యావరణ పరిరక్షణకు, నిర్ణయాత్మక శక్తిగా, శాస్త్రీయ నైపుణ్యత పొందిన రైతు సాధికారతను సాధించాలనేది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం.

పైలట్ ప్రాజెక్టుగా ఎంపికచేయడం సంతోషం



సేంద్రియ వ్యవసాయ పద్ధతి కోసం పైలట్ ప్రాజెక్టుగా మా గ్రామాన్ని అధికారులు ఎంపిక చేయడం సంతోషంగా ఉంది. రెండెకరాల పొలంను పొలంబడి కార్యక్రమానికి ఇచ్చాను. వారం వారం వ్యవసాయ అధికారులు వచ్చి మాకు మెలకువలు తెలియజేస్తున్నారు. వచ్చే ఖరీఫ్‌లో 150 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలోనే వరి సాగు చేయాలని గ్రామ రైతులు నిర్ణయాలు తీసుకున్నారు.

– యూ.సురేష్, నదికైరవాడి

పొలంబడితో ఎంతో మేలు



ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని మా గ్రామంలో చేపట్టడం వల్ల ఎంతో మేలు జరుగుతోంది. వారం వారం పొలంబడిలో పాల్గొనటం వల్ల పెట్టుబడులు తగ్గించుకొని దిగుబడులు ఎలా పెంచుకోవాలో అవగతమవుతుంది. సాంప్రదాయ వ్యవసాయానికి, సేంద్రియ వ్యవసాయానికి ఉన్న తేడా, ఆర్థిక వ్యత్యాసం చాలానే ఉంది.

– గోవిందరెడ్డి, వరి రైతు, నదికైరవాడి

రైతుల్లో చైతన్యం రావాలి



నదికైరవాడి గ్రామాన్ని పొలంబడి పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ ఏడాది ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా రైతుల్లో చైతన్యం రావాలి. వచ్చే ఖరీఫ్‌కు 150 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం హర్షణీయం. వ్యవసాయంలో సమగ్ర మార్పులు తెచ్చి లాభసాటిగా మార్చాలనేది ప్రభుత్వ ఆశయం.

– మహ్మద్ ఖాద్రి, ఏడీఏ, ఎమ్మిగనూరు

28న వాహనాల వేలం

వెల్దుర్తి: తమ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన వాహనాల వేలం ఈనెల 28న నిర్వహించనున్నట్లు డోన్ సెబ్ ఇన్‌స్పెక్టర్ భీమలింగ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ స్టేషన్ ఆవరణలో జరుగు వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా తమ ఆధార్ కార్డుతో తమ పేరు నమోదు చేసుకొని, ఎంట్రీ పాస్ తీసుకోవాలన్నారు. వేలంలో కొన్న వాహనం పూర్తి నగదు జీఎస్టీతో కలిపి అక్కడికక్కడే చెల్లించాల్సి ఉంటుందని, వివరాలకు 94409 02584 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

గాదిలింగప్ప తాతకు ప్రత్యేక పూజలు



గాదిలింగప్ప తాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆలూరు: హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో కొలువుదీరిన గాదిలింగప్ప తాత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఎద్దుల జాతరను నిర్వహించారు. స్వామి వారికి అర్చకులు గంగపూజ, ఫల, పుష్ప, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి పూజలు నిర్వహించారు. కురుబ కులస్తులు ప్రత్యేకంగా వండిన మాంసాహారాన్ని నైవేద్యంగా ఉంచి పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. 27న ఉత్సవాల ముగింపు సందర్భంగా పూర్ణాహుతి, వసంతోత్సవం, అనంతరం హుండీ ఆదాయం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ రాధాకృష్ణ తెలిపారు. దాదాపు ఐదు రోజుల పాటు ఘనంగా జరిగిన ఉత్సవాలు ముగియడంతో పక్క గ్రామాల భక్తులు టాటా ఏసీలు, ఎడ్లబండ్లపై గ్రామాలకు తరలివెళ్లారు.

రంగనాథ స్వామి రథోత్సవం



భక్తజన సందోహం మధ్య కదులుతున్న రథం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పులికొండ గ్రామంలో కొలువైన రంగనాథ స్వామి రథోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. సాయంత్రం భక్తజన సందోహం మధ్య రథోత్సవం వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి భక్తులు నందికోల సేవ చేశారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ గోపాల్ పోలీసు బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

నెరవేరిన కల



నాడు కంకర తేలిన రోడ్డు, నేడు తారు రోడ్డు వేస్తున్న దృశ్యం

మద్దికెర: మండల కేంద్రానికి మజారా గ్రామమైన బొజ్జనాయుని పేటకు రోడ్డు సౌకర్యం లేక ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కేవలం ఎన్నికల సమయంలో తప్పా ఇతర సమయాలలో ఆ గ్రామానికి వెళ్లిన నాయకులు లేరు. అయితే గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ రూ.2.75 కోట్లు మంజూరు చేయించి తారు రోడ్డు వేస్తుండడంతో 70 ఏళ్ల కల నేరవేరుతుందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



నాటి ఉపాధ్యాయుడు రాజమోహన్ రావు దంపతులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

43 ఏళ్ల స్నేహానుబంధం

గోనెగండ్ల: అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ నాలుగు దశాబ్దాల తర్వాత వారందరూ ఒక్కచోట కలిస్తే ఇక వారి ఆనందానికి అవధులు ఉండవు. నాడు అల్లరి చేష్టలు, మాటలు ఇప్పుడు వారి నుంచి రాకపోయిన తమ స్నేహితులను చూసుకొని హావభావాలతో పలకరించుకుంటూ మనస్ఫూర్తిగా నవ్వుతూ హాయిగా జరిపిన ఆ క్షణం వారి జీవితంలో మధురక్షణంగా మిగిలిపోతుంది. ఇలాంటి వేడుకకు వేదిక అయ్యింది గోనెగండ్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. 43 సంవత్సరాల క్రితం ఆ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం గోనెగండ్లలోని బాషా ఫంక్షన్ హాలులో జరిగింది. 1978–79, 1979–80 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన నాటి విద్యార్థులు తిరిగి కలుసుకుని వేడుక జరుపుకున్నారు. నాడు తమకు చదువులు చెప్పిన గురువు రాజమోహన్ రావు, మహేశ్వరీ దంపతులను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించి గురు భక్తిని చాటుకున్నారు. నాడు పాఠశాలలో గడిపిన సంఘటనలను నెమరు వేసుకుంటూ సందడిగా గడిపారు.

దస్తగిరయ్య స్వామి ఉరుసు

కృష్ణగిరి: మండల కేంద్రంలో ఆదివారం దస్తగిరయ్య స్వామి ఉరుసు ప్రారంభమైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఉరుసు సందర్భంగా దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు. గ్రామం బంధువులతో కళకళలాడుతోంది. సోమవారం తెల్లవారుజామున మేళతాళాల మధ్య స్వామికి గంధం సమర్పించనున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

ఉరుసు సందర్భంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను గ్రామస్తులు ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 32 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు చిరంజీవి, షేక్షా తెలిపారు. గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను అందించనున్నట్లు వారు వెల్లడించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



స్తంభం నేలవాలడంతో రోడ్డుపై వేలాడుతున్న తీగలు

హొళగుంద: స్థానిక పీహెచ్‌సీ వద్ద ఆదివారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం పడిపోయి తీగలు రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్తంభం రోడ్డు పక్కనే ఉండడంతో ట్రాక్టర్ మరో వాహనానికి దారిచ్చే క్రమంలో ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పంపాపతి స్పందించి విద్యుత్ శాఖాధికారిణి ఓబులమ్మ, సిబ్బందికి సమాచారమివ్వడంతో సరఫరాను నిలిపివేశారు. తీగలు రోడ్డుపై ఉండడంతో కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఘటనా స్థలానికి చేరుకున్న ఏఈ కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయించారు. ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు.

రిజర్వేషన్లు కల్పించడంపై హర్షం

హొళగుంద: కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాల్లో కన్నడ మీడియం చదివిన విద్యార్థులకు కర్ణాటక రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో ఉన్నత, సాంకేతిక, వృత్తిపరమైన కోర్సుల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ ఆ ప్రభుత్వం అసెంబ్లీలో 'కన్నడ భాషా సమగ్ర అభివృద్ధి విధేయక-2022' చట్టాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల హొళగుంద, ఆదోని కన్నడ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం హొళగుందలో కన్నడ సంఘం నాయకులు పంపన్నగౌడ్, దొడ్డబసప్ప, ఊకూరు కాడప్ప, పంపాపతి, ఎర్రిస్వామి, తదితరులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కన్నడ భాషా సమగ్ర అభివృద్ధి విధేయక-2022 చట్టం వల్ల ఏపీలో కన్నడ మీడియం చదువుతున్న విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ చట్టాన్ని అమలు చేయడంలో విశేష కృషి చేసిన కర్ణాటక సీఎం బసవరాజు బొమ్మై, మంత్రి సునీల్‌కుమార్, సిరుగుప్ప ఎమ్మెల్యే సోమలింగప్ప తదితరులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కర్ణాటక ప్రభుత్వం ఇక్కడి కన్నడిగులను మహారాష్ట్ర, కేరళ మాదిరిగా 'గడినాడు కన్నడిగులు'గా గుర్తించాలని, విద్యా, ఉద్యోగ పరంగా న్యాయం చేయాలని కోరుతూ సోమవారం బళ్లారిలో చేపట్టే ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా బడేసాహెబ్ తాత ఉరుసు



స్వామి వారికి గంధం తీసుకెళుతున్న పీఠాధిపతులు

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన మహాత్మ సద్గురు బడేసాహెబ్ ఉరుసు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉరుసు సందర్భంగా దర్గా వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారికి ముజావర్లు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. ఉరుసు మహోత్సవానికి రాష్ట్రం నుంచే గాక తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, బెంగళూర్ తదితర ప్రాంతాల నుంచి దాదాపు లక్ష మందికి పైగా భక్తులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్గా నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. పురుషులు, మహిళలకు వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉరుసులో మహిళలు, పిల్లలను ఆకట్టుకునేలా మట్టి గాజుల అంగళ్లు, బొమ్మల దుకాణాలు వెలిశాయి. స్వామివారి దర్శనం అనంతరం అంగళ్ల దగ్గరే మహిళలు పెద్దఎత్తున గుమికూడి గాజులు, బొమ్మలు, మిఠాయిలు కొనుగోలు చేశారు. అలాగే రంగురాట్నాలు పిల్లలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

గట్టి పోలీస్ బందోబస్తు

ఉరుసు మహోత్సవంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎమ్మిగనూరు రూరల్ సీఐ మోహన్ రెడ్డి, గోనెగండ్ల ఎస్ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సులు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పోలీసులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. మద్యం సేవించి అల్లర్లు చేయకుండా మందుబాబులకు ముందుగానే హెచ్చరికలు జారీచేశారు. దొంగతనాలు జరగకుండా పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఇద్దరు సీఐలు, 9 మంది ఎస్ఐలు, 110 మంది పోలీసులు, 35 మంది మహిళా పోలీసులు, 30 మంది వలంటీర్లతో విధులు నిర్వర్తించారు.

పంచాయతీలపై పన్ను పోటు

- ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా వసూళ్లలో మందగమనం
- ఇప్పటివరకు వరకు వసూళ్లు 50 శాతం లోపే..
- కుంటుపడుతున్న గ్రామాల అభివృద్ధి



అతి తక్కువ పన్ను వసూళ్లు సాధించిన దౌల్తాపురం సచివాలయం

చిప్పగిరి: గ్రామాల అభివృద్ధి ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో పాటు ఆయా గ్రామాల్లోని సంపద వనరులు, వసూలయ్యే పన్నులపై ఆధారపడి ఉంటుంది. అంతటి కీలక పాత్ర పోషించే పన్నుల వసూళ్లలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా ఆయా గ్రామ పంచాయతీల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మండలంలో మొత్తం 13 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. వీటిలో పన్ను వసూళ్లలో దౌల్తాపురం 35 శాతంతో కనిష్ఠ స్థాయిలో ఉండగా మేజర్ గ్రామ పంచాయితీ, మండల కేంద్రం చిప్పగిరి 30 శాతం వసూళ్లతో పూర్తిగా వెనుకబడింది. మొత్తం గ్రామ పంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. వీరికి తోడు అన్ని గ్రామాలకు ఆయా శాఖల సచివాలయ సిబ్బంది ఉన్నా మండలం మొత్తం మీద పన్నుల వసూళ్లలో ఎక్కడా ఇప్పటివరకు 50 శాతానికి మించలేదు. దీంతో పన్ను వసూళ్లపై అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లమవుతోందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పన్ను వసూళ్లలో వేగం పెంచేలా చర్యలు చేపట్టి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మార్చికల్లా వంద శాతం వసూళ్లు సాధిస్తాం



వసూళ్లలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. మార్చి చివరి నాటికి పన్ను వసూళ్లు 100 శాతం పూర్తి చేస్తాం.

– ఈఓపీఆర్డీ సంజన్న


ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందాం

ఆలూరు: పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందామని దేవనకొండ మండల కన్వీనర్ మల్లికార్జున, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అరుణ్‌కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలలోని ఎంపీటీసీలు, నాయకులతో త్వరలో సమావేశం నిర్వహించి అభ్యర్థుల గెలుపునకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేయనున్నట్లు వెల్లడించారు.

మొక్కుబడిగా టీడీపీ ప్రచారం

నందవరం: మండల కేంద్రంలో టీడీపీ నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం తూ..తూ మంత్రంగా సాగింది. మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి ఆదివారం గ్రామంలోని పట్టభద్రులను కలిసి టీడీపీ తరఫున పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అయితే ఎన్నికల ప్రచారానికి మండల నాయకులు హాజరు కాలేదు. ముఖ్యంగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, క్లస్టర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవరావు దేశాయ్, మండల కన్వీనర్ చిన్నరాముడు ప్రచారానికి రాకపోవడంతో విభేదాలు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మండల నాయకులు లేకపోవడంతో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం తూతూ మంత్రంగా కానిచ్చారు. యూత్ లీడర్ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు



దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

హొళగుంద: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారం సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జలాభిషేకం, మహా మంగళహారతి, సుప్రభాతసేవ, బండరార్చన, కుంకుమార్చనతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు గాను కర్ణాటక, ఆంధ్రా ప్రాంతం నుంచి భక్తులు తరలి వచ్చారు. కొందరు భక్తులు మొక్కులో భాగంగా భక్తులకు, అనాథలకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆస్పరి మఠంలో అన్నదానం చేపట్టారు.

పల్లె రోడ్లకు కొత్త శోభ

హొళగుంద: ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని పల్లె రోడ్లు కొత్త రూపు సంతరించుకున్నాయి. నిత్యం ప్రయాణంలో నరకం చూసే పల్లె ప్రజలకు కష్టాలు తీరిపోయాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హన్ రెడ్డి ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు.

అభివృద్ధి దిశగా పల్లె రోడ్లు

హొళగుంద – ఆలూరు వయా ఎల్లార్తి పంచాయతీ రాజ్ రోడ్డు నేడు కొత్తరూపును తెచ్చుకుంటోంది. హొళగుంద నుంచి షేక్షావలి, షాషావలి దర్గాలతో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి గ్రామం మీదుగా ఆలూరు వరకు దాదాపు 22 కి.మీ దూరం రోడ్డు గుంతలు పడి రాళ్లురప్పలతో అధ్వానంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి అధ్వానంగా ఉన్న రోడ్డును బాగు చేసేందుకు రూ.2.50 కోట్ల ఎన్‌డీబీ నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే హెబ్బటం–పెద్దగోనేహాళ్, పెద్దహ్యాట రోడ్డుతో పాటు రూ.1.70 కోట్ల పీఎంజీఎస్‌వై నిధులతో లింగంపల్లి రోడ్డు పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం హొళగుంద–ఢణాపురం, రూ.1.30 కోట్లతో 5 కి.మీ ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయి. త్వరలో ఆంధ్రా–కర్ణాటకకు వారధిగా ఉన్న మార్లమడికి 5 కి.మీ రోడ్డు డబుల్ రోడ్డుగా మార్చేందుకు గాను పనులు మొదలయ్యే అవకాశాలున్నాయి. దీంతో మండల ప్రజలకు త్వరలో రహదారి కష్టాలు తీరనున్నాయి.



అధ్వానంగా ఉన్న ఎల్లార్తి-ఆలూరు రోడ్డు (ఫైల్)



తారు రోడ్డుగా రూపుదిద్దుకున్న రహదారి



అధ్వానంగా ఉన్న లింగంపల్లి రోడ్డు



తారు రోడ్డుగా మారిన రహదారి